సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 16 । సెప్టెంబర్ । 2025



జీపీఓలు బాధ్యతగా..

ప్రభుత్వ భూముల పరిరక్షణలో జీపీఓలు బాధ్యతాయుతంగా పనిచేయాలని తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. 8లో▸



పెండింగ్ స్కాలర్‌షిప్స్..

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని విద్యార్థులు, ప్రైవేట్ విద్యాసంస్థలు గళమెత్తాయి. 8లో▸



ఏఐ సదస్సు విజయవంతం

ఏఐపై నిర్వహించిన సదస్సు అందరి సహకారంతో విజయవంతమైందని ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా పోలే అన్నారు. 8లో▸

పల్లెల్లో రోడ్ల చిచ్చు!

పాత అలైన్‌మెంట్లు.. కొత్త ప్రతిపాదనలు

పారిశ్రామికవాడలు.. రీజినల్ రింగ్‌రోడ్లు.. గ్రీన్‌ఫీల్డ్ రోడ్లు.. రేడియల్ రోడ్లు .. ఇలా వరుసగా జిల్లా రైతుల కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. ఇప్పటికే పలు పారిశ్రామిక వాడలు, ప్రాజెక్టుల పేరుతో భారీగా భూసేకరణ చేపట్టిన ప్రభుత్వం తాజాగా రోడ్ల విస్తరణ, కొత్త రోడ్ల ప్రతిపాదనలను తెరపైకి తెస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ ప్రకటనలతో ఉన్న కొద్దిపాటి భూములు, ఉపాధి అవకాశాలు కోల్పోవాల్సి వస్తుందనే ఆవేదన ఆయా రైతుల్లో వ్యక్తమవుతోంది.



ఇటీవల ఆమనగల్లులో ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు

- కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ప్రభుత్వ వరుస ప్రకటనలు
- అడ్డగోలు సర్వేలతో అయోమయం
- రోడ్డెక్కుతున్న రోజుకో గ్రామం రైతులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వం మారిన ప్రతిసారి రోడ్లకు సంబంధించిన అలైన్‌మెంట్లను మార్చుతుండటం, బడా రియల్ ఎస్టేట్ కంపెనీలకు, ప్రభుత్వ పెద్దలకు లబ్ధి చేకూర్చేలా, సన్న చిన్నకారు రైతులకు నష్టం వాటిల్లేలా అలైన్‌మెంట్లు మారుతుండటం ఆందోళనలకు కారణమవుతోంది. అధికారుల ప్రతిపాదనలకు భిన్నంగా ప్రకటనలు ఉంటుండటంతో ఆయా రోడ్లు, ప్రాజెక్టులకు భూములు ఇచ్చేందుకు రైతులు నిరాకరిస్తున్నారు. ఒక్కొక్కరుగా రోడ్డెక్కుతున్నారు. ఇప్పటికే మాడ్గుల, ఆమనగల్లు, కేశంపేట, షాద్‌నగర్ రైతులు వరుస ఆందోళనలు చేపట్టగా.. తాజా ప్రతిపాదనలతో మరికొంత మంది సన్నద్ధమవుతున్నారు.

వివాదాస్పదంగా కొత్త అలైన్‌మెంట్

నగరంలో వాహనాల రద్దీతో పాటు దూరభారాన్ని తగ్గించేందుకు ఔటర్‌కు అవతలి వైపున ఉత్తర భాగంగలోని సంగారెడ్డి-తూప్రాన్-గజ్వేల్-భువనగిరి-చౌటుప్పల్ మీదుగా.. దక్షిణ భాగంలోని చౌటు ప్పల్-షాద్‌నగర్-సంగారెడ్డి వరకు 356 కిలోమీటర్ల రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఏర్పాటుకు ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటికే ఉత్తర భాగంలో భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసింది. దక్షిణ భాగంలోనూ ఇటీవలే నోటిఫికేషన్ జారీ చేసింది. పాత అలైన్‌మెంట్‌కు భిన్నంగా కొత్తగా మరో అలైన్‌మెంట్ రూపొందించింది. దీంతో రోడ్డు విస్తీర్ణంతో పాటు భూ విస్తీర్ణం పెరుగుతోంది. పాత అలైన్‌మెంట్‌ను పక్కన పెట్టి.. కొత్తదాని ప్రకారం భూసేకరణ ప్రక్రియకు నోటిఫికేషన్ జారీ చేయడం వివాదాస్పదమైంది. జిల్లాలోని మాడ్గుల, ఆమనగల్లు, కేశంపేట, షాద్‌నగర్, ఫరూఖ్‌నగర్, కొందుర్గు, పరిగి, వికారాబాద్ మండలాల్లో భూములు కోల్పోతున్న రైతులు ఇప్పటికే ఆందోళన బాటపట్టారు.

గ్రీన్‌ఫీల్డ్ రోడ్లు.. రైల్వే లైన్లు

భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి బందర్ పోర్ట్ వరకు 118 కిలోమీటర్ల పొడవున 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్‌రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి గడ్కరీని కలిసి విన్నవించడం మరికొంత మంది రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఆర్ఆర్ఆర్ చుట్టూ రీజినల్ రింగ్ రైల్వే లైన్ సహా ఫ్యూచర్‌సిటీ నుంచి బందర్‌పోర్ట్ వరకు రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడం గందరగోళం సృష్టిస్తోంది. ఇప్పటికే రావిర్యాల నుంచి మీర్‌ఖాన్‌పేట్, అటు నుంచి ఆమనగల్లు వరకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు భూసేకరణ ప్రక్రియ చేపట్టిన ప్రభుత్వం తాజాగా ఇటు నుంచి మన్ననూర్ వరకు రోడ్డును విస్తరించనున్నట్లు ప్రకటించింది. శంషాబాద్ మండలంలోని ఓఆర్ఆర్ ఎగ్జిట్ 17 నుంచి పరిగి ఆర్ఆర్ఆర్ వరకు దాదాపు 55 కిలోమీటర్ల నయా రేడియల్ రోడ్డు ప్రతిపాదించింది. ఇలా ఒక రోడ్డు పనులను మొదలు పెట్టకముందే.. మరో కొత్త రోడ్డును తెరపైకి తీసుకొస్తుండటం, హడావుడిగా భూముల సర్వే చేస్తుండడం, అలైన్‌మెంట్లలో మార్పులు చేర్పుల పేరుతో రోజుకో రకంగా చేస్తున్న ప్రకటనలు రైతులను కలవరానికి గురి చేస్తున్నాయి.

భూమినే నమ్ముకున్నాం



సర్వే నంబర్ 217, 233లలో మూడెకరాల సాగు భూమి ఉంది. అది కూడా రీజినల్ రింగ్‌రోడ్డులో పోతోంది. ఇప్పటి వరకు భూమినే నమ్ముకుని బతికాం. పాత అలైన్‌మెంట్‌కు భిన్నంగా రోడ్డు వేస్తుండటంతో నష్టపోవాల్సి వస్తోంది. తక్షణమే ఈ ప్రతిపాదన విరమించుకోవాలి.

– వెంకటస్వామి,
రైతు, జంగారెడ్డిపల్లి, తలకొండపల్లి మండలం

రోడ్డున పడాల్సి వస్తుంది



వ్యవసాయమే జీవనాధారం. సాగునీటి వసతి పుష్కలంగా ఉంది. ఏడాదికి రెండు పంటలు పండుతాయి. నాకున్న 3.35 ఎకరాల భూమి నుంచే రీజినల్ రింగ్ రోడ్డు పోతోంది. నా కుటుంబం రోడ్డున పడాల్సి వస్తోంది. బంజరు భూములు వదిలి పంట భూముల నుంచి రోడ్లు వేయడం తగదు.

– వెంకటేశ్‌గౌడ్,
రైతు, తంగళ్లపల్లి, కొందుర్గు మండలం

భూములిచ్చే ప్రసక్తే లేదు



రీజినల్ రింగ్ రోడ్డు కోసం సర్వే నంబర్ 15,16లో నాలుగు ఎకరాలు పోతోంది. బడా భూస్వాములను వదిలి, సన్న, చిన్నకారు రైతులే లక్ష్యంగా భూసేకరణ చేపట్టడం ఎంత వరకు సమంజసం. తక్షణమే భూ సేకరణను నిలిపివేయాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ భూములిచ్చేది లేదు.

– అంజి యాదవ్,
బ్రాహ్మణపల్లి, మాడ్గుల మండలం

భూమికి భూమి ఇవ్వాలి



నాకు 2.10 ఎకరాల భూమి ఉంది. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణంతో ఎకరం తరి పొలాన్ని కోల్పోవాల్సి వస్తోంది. ఉన్న కొద్ది పాటి భూమి పోతే ఎలా బతకాలి. బహిరంగ మార్కెట్‌లో ఎకరం రూ.2 కోట్లు పలుకుతోంది. భూమికి బదులుగా భూమి, లేదంటే బహిరంగ మార్కెట్ ప్రకారం పరిహారం చెల్లించాలి.

– గాదమోని నరేశ్,
రైతు, ఎక్వాయిపల్లి, కడ్తాల్ మండలం

నాలుగు ఎకరాలు పోతాయి



పాత అలైన్‌మెంట్ ప్రకారం ట్రిపుల్‌ఆర్ రోడ్డును నిర్మించాలి. కొత్త అలైన్‌మెంట్ ప్రకారం నాలుగు ఎకరాలకుపైగా కోల్పోవాల్సి వస్తోంది. మా కుటుంబం వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తోంది. ప్రభుత్వం పాత అలైన్‌మెంట్ ప్రకారం రోడ్డు నిర్మించి న్యాయం చేయాలి.

– గుత్తి జంగయ్య,
రైతు, తొమ్మిదిరేకుల, కేశంపేట మండలం



షాబాద్: రైతు వేదిక వద్ద క్యూలైన్ చెప్పులు ఉంచి నిరీక్షిస్తున్న రైతులు

యూరియా.. ఎన్నాళ్లీ కష్టాలయా

షాబాద్: రోజులు గడుస్తున్నా రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. మండల కేంద్రంలోని రైతు వేదిక వద్దకు సోమవారం రైతులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. చెప్పులు క్యూ లైన్‌లో ఉంచి నిరీక్షించారు. 800 మంది రైతులకు ఒక్కో బస్తా చొప్పున అందజేశారు. యూరియా అందని రైతులు అధికారులను నిలదీశారు. దీంతో ఒకటిరెండు రోజుల్లో తెప్పిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఉసూరుమంటూ వెనుదిరిగారు.

తరలివచ్చి.. క్యూ కట్టి

శంకర్‌పల్లి: పట్టణంలోని వ్యవసాయ సహకార సంఘం వద్ద సోమవారం యూరియా పంపిణీ చేయగా రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వారిని లైన్లో నిల్చోబెట్టి, వచ్చిన ప్రతి ఒక్కరికి రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. అవసరానికి అనుగుణంగా తెప్పించాలని అన్నదాతలు కోరుతున్నారు.



శంకర్‌పల్లి: యూరియా కోసం బారులు తీరిన అన్నదాతలు

ఒక్కొక్కరికి రెండు బస్తాల చొప్పున..

చేవెళ్ల: మండలంలోని ఆలూరు పీఏసీఎస్‌కు సోమవారం 480 బస్తాలు, మనగ్రోమోర్ కేంద్రానికి 480 బస్తాల యూరియా వచ్చింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో రావడంతో గందరగోళం ఏర్పడింది. దీంతో పోలీసులు వారిని లైన్‌లో నిలబెట్టి ఒక్కో రైతుకు రెండు బస్తాలచొప్పున పంపిణీ చేశారు.

విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకం



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న డీఈఓ సుశీందర్‌రావు

- జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు

షాద్‌నగర్‌రూరల్: పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద కేజీబీవీని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠాలు బోధించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకమైన మెట్టు అని అన్నారు. క్రమ శిక్షణతో కూడిన విద్యను నేర్చుకొని పరీక్షల్లో రాణించాలని సూచించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని, సాధన కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహం, సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మనోహర్, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘రీజినల్’ అలైన్‌మెంట్ మార్చొద్దు

కందుకూరు: మార్చిన రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం కందుకూరు చౌరస్తాలో ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ.. వందల ఎకరాలున్న భూస్వాముల భూములను కాపాడడం కోసం పేద, సన్న, చిన్నకారు రైతుల భూములను రీజినల్ రింగ్ రోడ్డు పేరుతో దౌర్జన్యంగా తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే కొత్త అలైన్‌మెంట్‌ను రద్దు చేసి పాత అలైన్‌మెంట్ ప్రకారమే భూసేకరణ చేపట్టాలని అన్నారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కానుగుల వెంకటయ్య, ప్రజా సంఘాల నాయకులు గుమ్మడి కురుమయ్య, పిప్పళ్ల శివశంకర్, అంకగళ్ల కుమార్, మాజీ ప్రజా ప్రతినిధులు గడిగ వెంకటస్వామి, లక్ష్మయ్య, పబ్బతి శ్రీను, భూ నిర్వాసితులు పాల్గొన్నారు.



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న రైతులు, నాయకులు

న్యూస్‌రీల్

ప్రజావాణి అర్జీలను సత్వరం పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం చూపించే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో నేరుగా ప్రజల నుంచి డీఆర్ఓ సంగీతతో కలిసి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. ఈ వారం 33 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 25, ఇతర శాఖలవి 8 ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, మండల తహసీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు, సలహాలను తెలియజేయాలని కోరారు. 99592 26287 నంబర్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు.


ప్రతీ శిశువుకు పోలియో చుక్కలు వేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు

ఇబ్రహీంపట్నం రూరల్: పుట్టిన ప్రతి శిశువుకు పోలియో చుక్కలు వేయించాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం జిల్లా స్థాయి పల్స్ పోలియో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. జిల్లాలో ఐదేళ్ల లోపు 4.90 లక్షల మంది పిల్లలు ఉన్నట్లు గుర్తించామన్నారు. అక్టోబర్ 12న పోలియో బూత్‌ల్లో, 13 నుంచి 15వ తేదీ వరకు ఇంటింటికీ వెళ్లి ఆశ వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. పాఠశాలల పిల్లలు, ఇతర ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసి మహమ్మారిని తరిమికొట్టాన్నారు. సమావేశంలో వైద్యాధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించండి



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు, అంగన్‌వాడీలు

షాద్‌నగర్: అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు డిమాండ్ చేశారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన ప్రకారం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. పనికి తగిన వేతనం ఇవ్వాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలు చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సీబీఈ బకాయిలు ఇవ్వాలని కోరారు. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, సీనియార్టీ ప్రకారం ఇంక్రిమెంట్లు నిర్ణయించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను నాయక్, ఈశ్వర్ నాయక్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



ఔటర్‌పై బోల్తాపడిన కారు

దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా..

డివైడర్‌ను ఢీకొట్టి ఔటర్‌పై కారు బోల్తా

- యువతి మృతి, ముగ్గురికి తీవ్ర, నలుగురికి స్వల్ప గాయాలు



సౌమ్యారెడ్డి (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: స్నేహితులంతా కలిసి దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో వారు ప్రయాణిస్తున్న కారు ఔటర్ రింగ్ రోడ్డుపై అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఓ యువతి మృతిచెందగా ముగ్గురికి తీవ్ర, మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం వావిలాల గ్రామానికి చెందిన రాళ్లకత్వ వెంకటేశ్వర్ రెడ్డి కూతురు సౌమ్యారెడ్డి (25) నగరంలోని ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తోంది. తన స్నేహితులైన నందకిషోర్, వీరేంద్ర, ప్రణీష్, సాగర్, అరవింద్, ఝాన్సీ, శృతితో కలిసి ఆదివారం కారులో రాచకొండ సమీపంలోని సరళామైసమ్మ దేవాలయానికి వెళ్లారు. తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో రాత్రి బొంగ్లూర్ వద్ద ఔటర్‌పై నుంచి ఘట్‌కేసర్ వైపు వెళ్తుండగా మార్గమధ్యలో బలిజగూడ సమీపంలోకి రాగానే భారీగా కురుస్తున్న వర్షం కారణంగా వీరు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో సౌమ్యారెడ్డితో పాటు పలువురికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం వివిధ ఆస్పత్రులకు తరలించారు. సౌమ్యారెడ్డి చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందింది. మరో ముగ్గురు తీవ్రగాయాలతో చికిత్స పొందుతుండగా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దమంగళారంలో హార్టికల్చర్ వర్సిటీ!

- భూసేకరణకు సిద్ధమైన ప్రభుత్వం
- 373 ఎకరాల లావణి, సర్కార్ భూముల గుర్తింపు
- తాజాగా రైతులతో సమావేశమైన అధికారులు



రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ చంద్రకళ

మొయినాబాద్: ప్రభుత్వ, లావణి భూములు స్వాధీనం చేసుకునేందుకు సర్కార్ రంగం సిద్ధం చేస్తోంది. మొయినాబాద్ ప్రాంతంలో గోశాల ఏర్పాటుకు వంద ఎకరాలు కేటాయించిన ప్రభుత్వం మరో 373 ఎకరాల్లో హార్టికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటుకు సన్నాహాలు మొదలుపెట్టింది. ఇప్పటికే భూములు సర్వే చేసిన చేసిన రెవెన్యూ అధికారులు సోమవారం భూసేకరణపై రైతులతో సమావేశం నిర్వహించారు.

ఇప్పటికే పూర్తయిన సర్వే

మున్సిపల్ పరిధిలోని పెద్దమంగళారం రెవెన్యూలో హార్టికల్చర్ వర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రయత్నాలు మొదలు పెట్టింది. అందుకోసం ప్రభుత్వ, లావణి భూములను ఎంచుకుంది. సర్వే నంబర్ 218లో 227.35 ఎకరాలు, సర్వేనంబర్ 149లో 155.12 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించింది. ఆయా సర్వే నంబర్లలోని భూములను ఇప్పటికే రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. 218 సర్వేనంబర్‌లో అప్పట్లోనే 52 ఎకరాల భూమిని 16 మంది రైతులకు కేటాయించి లావణి పట్టాలు ఇచ్చారు. లావణి భూములు రైతులు ఇతరులకు విక్రయించడంతో చేతులు మారాయి. ప్రస్తుతం ఈ భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్నాయి. ఇదే సర్వే నంబర్‌లోని పది ఎకరాల్లో ప్రభుత్వ బాలుర వసతి గృహం, పల్లె ప్రకృతి వనం, ప్రార్థనా మందిరాలు నిర్మించారు. 149 సర్వే నంబర్‌లోని 155.12 ఎకరాల ప్రభుత్వ భూమిలో కొంత మంది రైతులు పంటలు సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ భూములను సర్కార్ స్వాధీనం చేసుకునేందుకు రైతులతో చర్చలు మొదలు పెట్టింది. రాజేంద్రనగర్‌లో ఉన్న హార్టికల్చర్ వర్సిటీని ఇక్కడ ఏర్పాటు చేసేందుకే భూసేకరణ జరుగుతున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది.

ప్రభుత్వ అవసరాలకే..

ప్రభుత్వ అవసరాల కోసం పెద్దమంగళారంలో భూసేకరణ జరుగుతోందని చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ అన్నారు. సోమవారం పెద్దమంగళారం వార్డు కార్యాలయం వద్ద రైతులు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధిలో భాగంగా ఇక్కడి సర్కారు భూములను తీసుకోవడం జరుగుతోందన్నారు. అసైన్డ్ పట్టా ఉన్న రైతులకు ఎకరాకు 800 గజాల స్థలం, పట్టా లేకుండా ప్రభుత్వ భూమిని సాగుచేసుకుంటున్న రైతులకు ఎకరాకు 300 గజాల చొప్పున పరిహారం ఇస్తామన్నారు. హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం లేఅవుట్ చేసి రైతులకు పరిహారం ఉంటుందన్నారు. త్వరలోనే మరోసారి సమావేశం నిర్వహిస్తామని, అప్పటిలోగా రైతులు తమ నిర్ణయాన్ని తెలియజేయాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఆర్ఐ రాజేష్, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొంపల్లి అనంతరెడ్డి, మాజీ సర్పంచ్ కోట్ల నరోత్తంరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ దప్పు రాజు, నాయకులు సంజీవరావు, మోహన్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయండి

- స్కావెంజర్ల జీతాల గోల్‌మాల్, మధ్యాహ్న భోజన బిల్లుల అవకతవకలపై విచారణ జరపాలి
- ప్రజావాణిలో అధికారులను కోరిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్


విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పూర్ణచందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రణయ్ తదితరులు

మహేశ్వరం: మహేశ్వరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకుని తక్షణమే సస్పెండ్ చేయలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విద్యార్థి సంఘం నాయకులతో కలిసి కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పూర్ణచందర్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీతకు వినతిపత్రం అందజేశారు. మహేశ్వరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గోపి అమ్మ ఆదర్శ పాఠశాల నిధులు దుర్వినియోగం చేస్తున్నాడని ఆరోపించారు. పాఠశాలలో 825 మంది విద్యార్థులకుగాను ప్రభుత్వం స్కావెంజర్ల జీతాల కోసం 2024 ఆగస్టు నుంచి రూ.20వేల చొప్పున విడుదల చేస్తోందని ఇద్దరు స్కావెంజర్లు నియమించి రూ.10వేల చొప్పున జీతం ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.7 వేల చొప్పున ఇచ్చి రూ.6 వేలు పక్కదారి పట్టించారని వివరించారు. సమయపాలన పాటించడం లేదన్నారు. మధ్యాహ్న భోజనంలోనూ రిజిస్టర్‌లో పేర్లు రాసి నిధులు దోచుకుంటున్నారన్నారు. స్కావెంజర్ల జీతాల గోల్‌మాల్, మధ్యాహ్న భోజన బిల్లుల అవకతవకల్లో పాఠశాల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పాత్ర ఉందని ఆరోపణలు వస్తున్నాయని.. సదరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగి బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడనే ఆరోపణ లు సైతం ఉన్నాయని విద్యాశాఖ అధికారులు స మగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కో రారు. లేదంటే విద్యార్థి సంఘాలను కలుపుకొని పె ద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఇందుకు అధికారులు సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తరంగ్, జిల్లా కమిటీ సభ్యులు సిద్ధు, తరుణ్, రాహుల్, కిరణ్, భరత్, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

యాచారం: అక్రమంగా తరలిస్తున్న ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మాల్ కేంద్రంలో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కడ్తాల్ మండల పరిధిలోని పల్లె చల్కతండాకు చెందిన మోతీలాల్ టాటా సుమో వాహనంలో ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నాడు. బియ్యం గురించి ఆయన్ను ప్రశ్నించగా సరైన సమాధానం చెప్పలేదు. దీంతో వాహనాన్ని టాటాసుమోలో ఉన్న రేషన్ బియ్యంపై విచారించగా సరైన వివరాలు తెలియజేయలేదు. దీంతో వాహనాన్ని, బియ్యాన్ని సీజ్ చేసి మోతీలాల్‌ను అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కొత్తూరు: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపై సోమవారం స్థానికులు ఓ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్ మృతదేహం పడిన తీరును పరిశీలించి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి వయస్సు 30-35 ఏళ్లు, ఉంటుందని తెల్లటి బనియన్ ధరించాడని చెప్పారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించామన్నారు, తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ మాస్టర్ వినీత్‌కుమార్ ఫిర్యాదు మేర కు కేసు దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


రాందాస్ మృతదేహం

శంషాబాద్ రూరల్: పొలానికి యూరియా చల్లేందుకు వెళ్లిన రైతు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని పెద్దతూప్ర తండాకు చెందిన కేతావత్ రాందాస్(43) వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేస్తుంటాడు. ఆదివారం సాయంత్రం అతను పొలంలో యూరియా చల్లేందుకు వెళ్లాడు. రాత్రి అవుతున్నా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి పొలం వద్ద చూడగా అతను పొలంలో బోర్లా పడి ఉన్నాడు. బోరు మోటారు ఆన్ చేసే క్రమంలో కరెంట్ షాక్ తగిలి మృతి చెందినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమష్టి సహకారంతో ఏఐ సదస్సు విజయవంతం


మాట్లాడుతున్న డాక్టర్ నీతా పోలే

ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా పోలే

షాద్‌నగర్‌రూరల్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై నిర్వహించిన జాతీయ సదస్సు అందరి సహకారంతోనే విజయవంతమయిందని ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా పోలే అన్నారు. పట్టణ సమీపంలోని గిరిజన గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ సహకారంతో విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. యాంత్రిక యుగంలో టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రభుత్వం విద్యా బోధనలోనూ మార్పులు తీసుకువస్తోందన్నారు. ఇందులో భాగంగా షాద్‌నగర్ పట్టణంలో ఏఐ పై జాతీయ సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, గిరిజన గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మి సహకారం ఎనలేనిదని అన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హాజరు విద్యార్థుల్లో సంతోషాన్ని నింపిందని అన్నారు. జాతీయ స్థాయి సదస్సు విద్యార్థుల్లో ఎంతో ప్రేరణకలిగించిందని అన్నారు. ఈ సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ కళాజ్యోతి, అధ్యాపకులు రాజేశ్వరి, పావని, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

మాడ్గుల సీఐ వేణుగోపాల్‌రావు

మాడ్గుల: శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వేణుగోపాల్‌రావు రౌడీషీటర్లను హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని ఠాణాలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవన్నారు. అసాంఘిక కార్యకలాపాలు కొనసాగించేవారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. సత్ప్రవర్తన ఉన్నవారిపై రౌడీషీట్లు తొలగించేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రూ.లక్ష పూచీకత్తుతో బైండోవర్ చేశామని సీఐ తెలిపారు.

జీపీఓలు బాధ్యతగా పనిచేయాలి

ప్రభుత్వ భూములను పరిరక్షించండి

- అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి
- నేటి నుంచి 19 క్లస్టర్లలో ఆఫీసర్ల విధులు


తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి నియామక పత్రాలు అందజేస్తున్న జీపీఓలు

అబ్దుల్లాపూర్‌మెట్: గ్రామాల్లోని ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో జీపీఓలు (గ్రామ పాలన ఆఫీసర్లు) బాధ్యతాయుతంగా పనిచేయాలని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి సూచించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నియమించిన జీపీఓలకు సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని గ్రామాల్లో క్లస్టర్ల వారీగా బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు 19 మంది జీపీఓలు తమ నియామక పత్రాలను తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి అందజేసి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీపీఓలు తమకు కేటాయించిన గ్రామాల్లోని ప్రభుత్వ భూములు, సీలింగ్ భూములు, భూదాన్‌భూములు అన్యాక్రాంతం కాకుండా నిత్యం పర్యవేక్షిస్తుండాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ రెవెన్యూ శాఖకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ప్రజలకున్న రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా విధులు నిర్వహించి ప్రభుత్వం, ప్రజల మన్ననలను పొందాలని సూచిస్తూ విధుల్లో చేరిన జీపీఓలను అభినందించారు. మండలంలో మొత్తం 22 క్లస్టరు ఉండగా మంగళవారం నుంచి 19 క్లసర్లలో జీపీఓలు విధులు నిర్వహిస్తారని వెల్లడించారు.

క్లస్టర్ల వారీగా వివరాలు

క్లస్టర్	జీపీఓ
కోహెడ	మణిమాల
లష్కర్‌గూడ	శైలజ
పెద్ద అంబర్‌పేట-2	స్వాతి
పెద్ద అంబర్‌పేట-1	మంజుల
తుర్కయంజాల్-1	హన్మంత్
తుర్కయంజాల్-2	శివలీల
తట్టిఅన్నారం	శరత్‌చంద్ర
పసుమాముల	దయానంద్
కవాడిపల్లి	అంజయ్య
తారమతిపేట	తిరుమలయ్య
ఉమర్‌ఖాన్‌దాయర	కృష్ణ
అబ్దుల్లాపూర్-1	కవిత
అబ్దుల్లాపూర్-2	రాకేశ్
గౌరెల్లి	కవితారాణి
తొర్రూర్	నర్సింహరాజు
అనాజ్‌పూర్	రీనాకుమారి
కుంట్లూర్-1	అఫ్జల్
ఇంజాపూర్	సుప్రియ
బాటసింగారం	వెంకటరత్నం

పోక్సో కేసుల తగ్గింపునకు కృషి



షీటీం ఆధ్వర్యంలో బాలికలకు అవగాహన

ఎస్‌ఐ పుష్పలత

తాండూరు టౌన్: పెరుగుతున్న పోక్సో కేసులను తగ్గించేందుకు అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని తాండూరు పట్టణ ఎస్‌ఐ పుష్పలత అన్నారు. సోమవారం షీ టీం ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ మార్క్స్ పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. విద్యార్థినులకు పోక్సో చట్టం, మానవ అక్రమ రవాణా, బాల్యవివాహాలు, సైబర్ క్రైమ్‌లపై అవగాహన కల్పించారు. వేధింపులకు గురైన సమయంలో స్పందించాల్సిన వివరాలను తెలిపారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ.. బాలికలు, మహిళలు ఎలాంటి వేధింపులకు గురైనా వెంటనే షీ టీంకు లేదా 100 నంబర్‌కు డయల్ చేయాలన్నారు. 18 ఏళ్ల లోపు బాలికలను లైంగికంగా వేధిస్తే, వారిపై పోక్సో కేసు నమోదవుతుందన్నారు. బాలికలకు చట్టాలు, పోలీసు, న్యాయ వ్యవస్థ గురించారు. కార్యక్రమంలో జిల్లా కళాజాత బృందం ఇన్‌చార్జి అశోక్, తాండూరు షీటీం ఇన్‌చార్జి శేఖర్, పాఠశాల ప్రిన్సిపాల్ ఆరోగ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తండ్రి మృతిని తట్టుకోలేక.. కుమారుడి బలవన్మరణం

శంషాబాద్ రూరల్: తండ్రి మృతిని జీర్ణించుకోలేక కుమారుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా, నిడదవోలు మండలం, సెట్టిపేటకు చెందిన రోళ్ల వెంకట సుబ్బయ్య(57), రోళ్ల లక్ష్మీ దంపతులు ఆరు నెలల క్రితం ఉపాధి కోసం వలస వచ్చారు. బుర్జుగడ్డతండా శివారులోని దీప్‌రాజ్ సింగ్ బైస్ ఫాంహౌజ్‌లో పని చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. సుబ్బయ్య తండ్రి కోటయ్య మూడు నెలల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి సుబ్బయ్య మానసికంగా బాధపడుతుండేవాడు. సోమవారం ఉదయం సుబ్బయ్య తోటలో పనికి వెళ్లాడు. ఆరు గంటల సమయంలో టీ తాగడానికి లక్ష్మీ భర్తకు ఫోన్ చేయగా.. సమాధానం రాలేదు. దీంతో ఆమె అతని గాలించగా తోటలో మామిడి చెట్టుకు కేబుల్ వైరుతో ఉరి వేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుంగ్‌ఫూలో విద్యార్థుల ప్రతిభ


ట్రోఫీలు అందుకున్న విద్యార్థులతో మాస్టర్లు

షాద్‌నగర్: పట్టణంలోని ఏకే ఫంక్షన్ హాల్‌లో సోమవారం రాష్ట్రస్థాయి మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో షాద్‌నగర్ న్యూపర్ కుంగ్‌ఫూ అకాడమీకి చెందిన విద్యార్థులు చైతన్, రాహుల్, అజ్మ, ప్రేమ్‌కుమార్, రక్షిత్, నిత్విక్, జునైనా, సాత్విక్, పుర్హాన్, సాత్విక్, శశాంత్, చరణ్ పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచారు. అదేవిధంగా దీక్షిత, గీతిక, అప్సర్ రెండో స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మాస్టర్ కనకంయాదవ్, మాస్టర్లు బాల్‌రాజ్, నరేందర్, అహ్మద్‌ఖాన్ ట్రోఫీలు అందజేశారు.

'సింబయాసిస్'లో కార్మికుడి మృతి


అమిత్ కుమార్ మృతదేహం

నందిగామ: వర్సిటీలో వా టర్ ట్యాంక్ శు భ్రం చేసేందుకు వెళ్లిన కార్మికుడు ప్రమాదవశాత్తు ట్యాంక్‌లో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని మొదళ్లగూడ శివారు సింబయాసిస్ అంతర్జాతీయ విశ్వవిద్యాలయంలో సోమ వారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన ప్రకారం.. మ హారాష్ట్రలోని సాతర జిల్లా కున్నీ గ్రామానికి చెందిన అమిత్‌కుమార్ కైమొడే(32) కొంత కాలంగా వర్సిటీలో హిప్రో వాష్ క్లీనింగ్ స ర్వీస్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. కళాశాల భవనంపై ఉన్న ట్యాంక్ శుభ్రంచేస్తున్న క్ర మంలో ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. గమనించిన వర్సిటీ నిర్వాహకులు పోలీసులకు సమా చారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న పోలీసు లు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మట్టి తరలిస్తున్న లారీ సీజ్

హయత్‌నగర్: అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఓ లారీని పోలీస్‌లు సీజ్ చేశారు. సీఐ నాగరాజు గౌడ్ తెలిపిన ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కొహెడాలో ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డులో సోమవారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. అటుగా వస్తున్న లారీని నిలిపి తనిఖీలు చేపట్టగా ఎటువంటి అనుమతి పత్రాలు లేవు. దీంతో స్థానిక తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు డ్రైవర్ దయాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి లారీని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఎనిమిది మంది అరెస్ట్

శంకర్‌పల్లి: పేకాట స్థావరంపై రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ, శంకర్‌పల్లి పోలీసులు సంయుక్తంగా సోమవారం దాడులు నిర్వహించారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. మున్సిపల్ శివారులోని అల్ట్రాటెక్ కంపెనీలో పని చేస్తున్న డ్రైవర్లు, కంపెనీలోని వెయిటింగ్ రూంలో పేకాడుతున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ, శంకర్‌పల్లి పోలీసులు దాడులు చేయగా ఎనిమిది మంది పేకాడుతూ చిక్కారు. వారి వద్ద నుంచి రూ.10,970 నగదు, ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆదిబట్ల మున్సిపల్ మేనేజర్‌పై ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపల్ మేనేజర్ రమేశ్‌పై ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు ఓ యువకుడు ఫిర్యాదు చేశాడు. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని 135 ప్లాటు నంబర్‌లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్, ఫైర్ ఎన్‌ఓసీ లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారని సెప్టెంబర్ 1వ తేదీన ప్రశాంత్‌రెడ్డి అనే యువకుడు ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. మున్సిపల్ మేనేజర్ రమేశ్ 63034 35649 నంబరు నుంచి కాల్ చేసి మీకు ఎందుకు అంత ఇంట్రెస్టు అని తన ఫోన్‌కు మేసేజ్ పెట్టాడని.. ఓ ప్రభుత్వ అధికారి ఇలా మేసేజ్ పెట్టడం ఎందుకని సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. మేనేజర్ రమేశ్ నిర్వహిస్తున్న కివి హోటల్‌కు ట్రేడ్ లైసెన్స్ సైతం లేదని పేర్కొన్నాడు.

పెండింగ్ స్కాలర్‌షిప్స్ చెల్లించాలి

ఆందోళన చేపట్టిన విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థులు


బడంగ్‌పేట్: నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న యాజమాన్యం


ఆర్డీఓ అనంతరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు, విద్యాసంస్థల యాజమాన్యాలు


ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీతారెడ్డికి..

ఇబ్రహీంపట్నం: ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని విద్యార్థులు, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు గళమెత్తాయి. సోమవారం ఇబ్రహీంపట్నంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్ సునీతారెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.8,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు బకాయి పడిందని, అవి చెల్లించకుంటే విద్యాసంస్థలను మూసివేస్తామని యాజమాన్యాలు హెచ్చరించిన నేపథ్యంలో విద్యార్థులు రోడ్లపైకి వచ్చి తమ జీవితాలను నాశనం చేయొద్దంటూ ఆందోళన చేపట్టారు. విద్యార్థి సంఘాలు విద్యార్థులకు బాసటగా నిలిచాయి. స్కాలర్‌షిప్‌లు రాకపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

ఉన్నత విద్యాసంస్థలు బంద్

బడంగ్‌పేట్: రాష్ట్ర ఉన్నత విద్యాసంస్థల సంఘం పిలుపు మేరకు బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని ఉన్నత విద్యాసంస్థలు సోమవారం బంద్‌కు పిలుపునివ్వడంతో ఉన్నత విద్యాసంస్థలు మూసివేశారు. నాలుగేళ్లుగా పేరుకుపోయిన బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాలాపూర్‌లోని బద్దం బాల్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, బిజినెస్ స్కూల్ వద్ద యాజమాన్యాలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ బద్దం జైపాల్‌రెడ్డి, డైరెక్టర్ బద్దం సునీత భూపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె.మాధవి, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తీవ్రంగా నష్టపోతాం

స్కాలర్‌షిప్‌లను, ఫీజు రియంబర్స్‌మెంట్‌ను ప్రభు త్వం విడుదల చేయకుంటే ప్రైవేట్ విద్యాసంస్థల మనుగడ ఎలా సాగుతుంది. తమ విద్యాబోధనకు ఆటంకం కలుగుతుంది. కళాశాలలను మూసేస్తే తాము నష్టపోతాం..ఆ నష్టాన్ని ఎవ్వరూ పూడ్చలేరు.

– మల్లిక, విద్యార్థిని, ఎంపీహెచ్‌డబ్ల్యూ, ద్వితీయ సంవత్సరం

ఇబ్బంది పడుతున్నాం

చదువుకునేందుకు సుదూర ప్రాంతం నుంచి వచ్చాం. ప్రతీ నెల లేదా విద్యా సంవత్సరం పూర్తి చేసుకున్న తర్వాతైనా స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి. అవి తర్వాత విద్యాసంవత్సరానికి ఉపయోగకరంగా ఉంటాయి. ఇప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

– యశస్విని, డీఎంఎల్‌టీ, ద్వితీయ సంవత్సరం

ఇద్దరి నుంచి రూ.49.4 లక్షలు స్వాహా

టెలిగ్రామ్ యాప్ కేంద్రంగా వ్యవహారం

- సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: సోషల్‌మీడియా యాప్ టెలిగ్రామ్ ద్వారా ఇద్దరు నగర వాసులకు ఎర వేసిన సైబర్ నేరగాళ్లు రూ.49.4 లక్షలు కాజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు సోమవారం కేసులు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మెహదీపట్నం ప్రాంతానికి చెందిన ఓ వ్యాపారి కొన్నేళ్లుగా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌తో పాటు ఆన్‌లైన్‌లో హోల్‌సేల్‌గా వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. ఈ ఏడాది మే 13న తక్కువ ధరకు బల్క్‌లో వస్తువుల విక్రయం పేరుతో ఉన్న ఓ టెలిగ్రామ్ గ్రూపు ఆయన దృష్టికి వచ్చింది. అందులో ప్రవేశించిన అతను రూ.30 లక్షల విలువైనవి ఆర్డర్ చేసి... రూ.9,99,990 అడ్వాన్స్‌గా చెల్లించారు. ఆపై అతడిని సంప్రదించిన నేరగాళ్లు డెలివరీ సమస్య ఉందంటూ నమ్మించి మరో రూ.3 లక్షలు డిమాండ్ చేయడంతో ఆ మొత్తం కూడా చెల్లించారు. ఇలా పదేపదే అతడిని సంప్రదించి పలు దఫాలుగా మొత్తం రూ.39,74,989 బదిలీ చేయించుకున్నారు. ఆపై వారి నుంచి స్పందన లేకపోవడం, సదరు గ్రూపుతో పాటు వారి ఫోన్లు పని చేయడకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. మరో ఉదంతంలో ఇన్‌స్టాగామ్‌లో ట్రేడింగ్ పేరుతో వచ్చిన ఓ రీల్ చూసిన ఆకర్షితుడైన లక్డీకాపూల్ వాసి వర్చువల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, పెట్టుబడులు పెట్టి భారీగా నష్టపోయాడు. బాధితుడు ఆగస్టు 19న ఇన్‌స్టాగామ్‌లో బ్రౌజ్ చేస్తుండగా కనిపించిన రీల్ ఆధారంగా నోమురా అనే వర్చువల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నాడు. ఆపై అతడిని ఓ వాట్సాప్ గ్రూపులో చేర్చిన సైబర్ నేరగాళ్లు ఇన్వెస్ట్‌మెంట్స్ పేరుతో ఎర వేశారు. నేహా అయ్యర్ అని చెప్పుకున్న మహిళ ఆ యాప్ ద్వారా పెట్టుబడి పెట్టమంటూ అతడికి సూచించింది. తొలుత అతగాడు వర్చువల్ యాప్‌కు రూ.9,65,400 బదిలీ చేశారు. లాభాలతో కలిపి ఆ యాప్‌లో రూ.27,51,400 బ్యాలెన్స్ చూపించింది. ఆ మొత్తం విత్‌డ్రా చేసుకోవాలని ప్రయత్నిస్తే సాధ్యం కాలేదు. ఆ డబ్బు తిరిగి తీసుకోవాలంటే మరో రూ.18 లక్షలు సైబర్ నేరగాళ్లు డిమాండ్ చేశారు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు సైబర్ ఠాణాను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.